క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు 15 పతకాలు

నంద్యాల(న్యూటౌన్): 6వ స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నంద్యాల జిల్లాకు 15 పతకాలు వచ్చినట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నూర్ బాషా మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు నంద్యాల నుంచి అండర్–11 ఏబీసీ కవాంకీ విభాగంలో ఆరిఫ్ బాషా, జఫీవుల్లా బంగారు పతకం, దుర్గా విష్ణుయస్, మహేంద్ర, హర్షవర్ధన్, మన్విత్‌రెడ్డి, మోక్ష, విష్ణు, త్రిణయన్, పవన్‌కార్తీక్‌లు కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. దినేష్, నిరంజన్, దీపక్, దుర్గాలు వెండి మెడల్స్ దక్కించుకున్నారన్నారు. 14ఏళ్ల లోపు కహవాంకీ జోడత్‌లో ఎస్‌ఎండీ ఆయాన్, ఇన్‌సెట్ జాయ్ బంగారు పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన కీరడాకారులను ఆయన అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కాశీనాయన ఆరాధనోత్సవాలు

రుద్రవరం: మండల కేంద్రానికి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహ్మస్వామి సన్నిధిలో, చిన్నకంబలూరు మెట్ట, ముత్తలూరుమెట్ట, మందలూరు తదితర ప్రదేశాల్లో వెలసిన శ్రీ అవధూత కాశీనాయన ఆశ్రమాల్లో మంగళవారం ఆరాధన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు కాశీనాయన విగ్రహానికి అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేపట్టారు. భక్తాదులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. హోమాది పూజల్లో రాష్ట్ర ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బ చంద్రశేఖర్, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగిశెట్టి తిమ్మయ్య, ఏర్వ క్రిష్ణమూర్తి, కేసీ నరసింహ్ములు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కల్పనా సెంటర్‌లోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో మంగళవారం శ్రీకాశిరెడ్డి నాయన 28వ ఆరాధన ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి ఉత్సవ మూర్తికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి యధావిధిగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి పాల్గొన్నారు.

లెప్రసీ కేస్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: లెప్రసీ కేస్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు ప్రతి ఇంటిని సర్వే చేసి లెప్రసీ కేసులు, లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం వైద్య సిబ్బందిని 1,611 టీములుగా విభజించి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశ కార్యకర్త, వలంటీరు ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ శారదాబాయి, డాక్టర్ చంద్రశేఖర్, సునీత, పారామెడికల్ ఆఫీసర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఎదుట పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్ నుంచి సాయిబాబానగర్ వరకు 99 మీటర్ల ఎర్రజెండాతో ర్యాలీ నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారుల ఆధ్వర్యంలో డప్పు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సీపీఐ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ సీనియర్ నాయకులు సలాం ఖాన్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో మోటా రాముడు, బాబాఫక్రుద్దీన్, ధనుంజయుడు, సోమన్న, శ్రీనివాసులు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక రైతు మృతి

మహానంది: గడ్డి మందు సేవించిన సీతారామపురం గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి జగన్ శ్రీనివాసులు (55) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. ఎస్‌ఐ జి. నాగేంద్రప్రసాద్ వివరాల మేరకు గ్రామానికి చెందిన శ్రీనివాసులు వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. నంద్యాలలో పలు బ్యాంకుల్లో పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. సుమారు రూ.ఆరు లక్షలు అప్పు ఉంది. ఈనెల 24న వరి పొలానికి గడ్డి మందు కొట్టి ఇంటికి వచ్చిన తర్వాత ఇంట్లో గడ్డి మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందారన్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ‘ఆడుదాం ఆంధ్ర’

- అట్టహాసంగా ప్రారంభమైన క్రీడాపోటీలు
- పోటీలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు



క్రీడా పోటీల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్, జేసీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

నంద్యాల(సిటీ): యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను, ప్రతిభను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి జాతీయ జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించి, జ్యోతి ప్రజ్వలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నంద్యాల నియోజకవర్గ పరిధిలో నంద్యాల అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని సచివాలయాల పరిధిలో సుమారుగా 10,017 మంది పురుషులు, 4,147 మంది మహిళలు ఆడుదాం ఆంధ్ర పోటీలకు నమోదు చేసుకున్నారన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న అతిథులు కాసేపు క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలను ఆడి యువకులను ఉత్సాహపరిచారు. ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి, రాష్ట్ర ముస్లింమైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లాలు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.100కోట్లతో క్రీడా పోటీలు నిర్వహించి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి రాజు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంఈఓ బ్రహ్మం నాయక్ సచివాలయాల కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి ప్రతిష్టలు

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- అట్టహాసంగా ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడల ప్రారంభం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నతమైన భవిష్యత్‌తో పాటు కుటుంబ సభ్యులకు, పుట్టిన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ కళాశాల ఆవరణలో మంగళవారం కమిషనర్ రమేష్‌బాబు అధ్యక్షతన ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించెందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లెందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రికెట్ ఆటల పోటీల్లో బ్యాటింగ్ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌మెన్ నాయబ్ రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభం

శిరివెళ్ల: ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 16 గ్రామ సచివాలయాలలో సర్పంచులు, ఎంపీటీసీలు ఆటల పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందచేశారు. ఆటలకు మొత్తం ప్రతి సచివాలయం నుంచి 218 మంది చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మండలంలో మొత్తం 3,488 మంది క్రీడాకారులు ఆటలలో పాల్గొననున్నారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓ ఆర్డీ నాగేంద్ర ఆటలను పర్యవేక్షించారు. కార్యక్రమాలలో స్టేట్ హిస్టరీ ఆకాడమీ డైరెక్టర్ హఫీజ్, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు నరహరి, సర్పంచులు సాలమ్మ, మరియమ్మ, సుభహాన్, మందాల శివారెడ్డి, దూదేకుల ఉశేనిబీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్వర్యంలో ఆడుదాం–ఆంధ్ర క్రీడల పోటీలను ముఖ్యఅతిథులుగా సర్పంచ్ తొలసమ్మ, ఉపసర్పంచ్ మహమ్మద్‌సోహెల్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ పాల్గొని పోటీలను ప్రారంభించారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 3802 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన ఆడుదాం అంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుందా ఆంధ్ర క్రీడా పోటీలను జెడ్పీటీసీ జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ ప్రారంభించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వైద్యాధికారిణి అపర్ణ, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు గగ్గెర వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, సర్పంచ్ మేకల ఓబులేస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయ బృందం మంగళవారం ఆడుదాం ఆంధ్రలో పోటీలను ప్రారంభించారు. ఎర్రగుడిదిన్నెలో ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. జెడ్పీటీసీ మాధవి, సింగిల్‌విండో డైరెక్టర్ పుల్లారెడ్డి, ఉప సర్పంచు సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలతో ప్రతిభ గుర్తింపు

గోస్పాడు: ఆడుదాం ఆంధ్ర క్రీడల ఏర్పాటుతో క్రీడాకారుల ప్రతిభ గుర్తించేందుకు అవకాశం ఉందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి అన్నారు. గోస్పాడు మండలంలోని దీబగుంట్ల హైస్కూల్‌లో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనసూయ, తహసీల్దార్ విజయశేఖర్, ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఫిజికల్ డైరెక్టర్లు విశ్వనాథ్, సాల్మాన్, శేషు, నాగలక్ష్మి, గీత, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుడిదిన్నెలో బ్యాటింగ్ ఆడుతున్న పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి



రాయమాల్పురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ శెట్టి ప్రభాకర్

గ్రామాల్లో అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

నంద్యాల(అర్బన్): మండలంలోని అయ్యలూరు, రాయమాల్పురం గ్రామాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అయ్యలూరు గ్రామంలో జరిగిన పోటీలను ఎంపీడీఓ సుగుణశ్రీ, గ్రామసర్పంచ్ ఓబులేసు ప్రారంభించారు. రాయమాల్పురం గ్రామంలో జరిగిన పోటీలను ఎంపీపీ శెట్టి ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బసవేశ్వరరెడ్డి, పులిమద్ది గ్రామ సర్పంచ్ రఘురామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీరారెడ్డిపల్లెలో క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న సర్పంచులు



చాగలమర్రిలో ఆడుదాం-ఆంధ్ర పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ తొలసమ్మ



ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి



ఉయ్యాలవాడలో క్రీడాకారులకు బ్యాట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు



దీబగుంట్లలో క్రీడలను ప్రారంభిస్తున్న పీపీ నాగిరెడ్డి

కులమతాలకు అతీతంగా పాలన

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- 35వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమాభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): కుల మతాలకు అతీతంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 35వ వార్డు డేనియల్‌పురంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ బాషిద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించి, బుక్‌లెట్లను అందించారు. అర్హులందరికీ ప్రభుత్వం అందించిన లబ్ధితో ఎలాంటి మార్పులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత నాలుగున్నరేళ్లలో 99శాతం పైగా హామీలన్నీ నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని పనులను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు. విద్య వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలన్నీ తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రాష్ట్రమంతా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓట్లకోసం ఇళ్ల వద్దకు వచ్చే టీడీపీ నాయకులను ప్రజలు నమ్మ వద్దని, మళ్లీ జగనన్నను గెలిపించి సురక్షాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, పట్టణ అధ్యక్షుడు పున్నాశేషయ్య, వైస్ చైర్మన్ పాంషావలి, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పైలట్, పెద్ద మౌలాలి, ఆదిల్ హుస్సేన్, అతావుల్లాఖాన్, ఫరతుల్లా, ఆటోనగర్ జాకీర్, చింపింగ్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి వేడుకలు



షిర్డీ సాయిబాబా దేవస్థానంలో పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



చాగలమర్రిలో పూజల్లో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబ దేవాలయాల్లో మంగళవారం దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, సహస్ర జలాభిషేకము నిర్వహించి స్వామివారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిన దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందజేశారు. షిర్డిసాయినాథుడికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి కాగడ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాగుకుంట రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయం, బొమ్మలసత్రంలో నిర్మాణంలో ఉన్న షిర్డీ ఆలయంలో, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద జంబులాపరమేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న సాయిబాబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మా స్పటిక లింగేశ్వర ఆలయంలో దత్త పౌర్ణమిని పురస్కరించుకొనిస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వంహించారు.

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని పాత బస్టాండు సమీపంలో నిర్మించిన ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పాస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీషిర్డీ సాయి మందిరంలో మంగళవారం దత్త జయంతిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు కైప నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో మహిళా భక్తులు అనఘాదేవి వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నంద్యాలకు చేరిన పాదయాత్ర

నంద్యాల(అర్బన్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వీరపల్లి శంకరన్న, బృందం సభ్యులు షాద్‌నగర్ నుంచి తిరుమల దేవస్థానంకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం నంద్యాలకు చేరుకుంది. పార్టీ పట్టణ అధ్యక్షులు చింతలయ్య, అధికారి ప్రతినిధి ఊకొట్టు వాసులు శంకరన్న పాదయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు మల్లికార్జున, నందిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్షులు గౌస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్స్ సిబ్బందిని అప్కాస్ ద్వారా రెగ్యులర్ చేసి వారికి జీతాలను పెంచాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసుకు అందజేశారు.

స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని ఏఐకేఎంఎస్(అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు) అల్లాబకాష్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి శంకర్ డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఉమ్మడి జిల్లా 8వ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 29న కర్నూలు నగరంలో 8వ ఉమ్మడి జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయకూలీలు, కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సోమన్న, లక్ష్మయ్య, బాలయ్య, రోశిరెడ్డి, హుసేన్‌బాషా, ఫరూక్, మద్దిరెట్టి, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- మిట్టపల్లెలో ‘గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మొదలు పెట్టిన మొట్టమొదటి రోజు నుంచే అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. దీంతో మళ్లీ ఆయనే సీఎంగా కావాలని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా మంగళవారం మిట్టపల్లె సచివాలయం పరిధిలోని మిట్టపల్లె, యాదవాడ గ్రామాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్లలో ఇప్పటి వరకు ఒక్కో కుటుంబానికి ఏఏ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందనే విషయాన్ని ఎమ్మెల్యే స్వయంగా చదివి వివరించారు. ఇచ్చిన హామీలు దాదాపు 99 శాతం నెరవేర్చడంతో నేడు దైర్యంగా ప్రతి గడపకు వెళ్లి గర్వంగా ఇవి మీకు చేశామని చెప్పగలుగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్‌లు యాతం వెంకటలక్షమ్మ, సరస్వతి, ఎంపీటీసీ రేవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు యాదవాడ నరసింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, కొండయ్య, శివారెడ్డి, కొండారెడ్డి తదితరులున్నారు.

ఉజ్వల పథకంతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్



ఆర్.పాంపల్లెలో ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

ఉయ్యాలవాడ : ఉజ్వల పథకం ద్వారా రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్నట్లు ఈఓపీఆర్‌డి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను గ్రామ సర్పంచ్‌లు చాబోలు లక్ష్మీదేవి, ఇరిగెల లక్ష్మీపద్మజల అధ్యక్షతన నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. పీఎం కిసాన్ ఆయుష్మాన్ భారత్, అటల్ ఫించన్, పీఎంఏజెవై, పీఎం ఆవాస్ యోజన పథకాలపై ఎల్‌ఈడీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కపురం శివమ్మ, పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ రహీమ్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామికి అష్టాదళ పాదపద్మారాధన సేవ..

పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో మంగళవారం ధనర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తిరుమంజన సేవలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించారు. అనంతరం వేదపండితులచే 108 బంగారు పుష్పాలచే స్వామి వారికి అష్టాదళ పద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.